www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 2 అక్టోబరు 2023



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అమూల్యం


ఆర్‌డిఒ ఖాజావలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా అమూల్యమైనదని ఏలూరు ఆర్‌డిఒ, ఉంగుటూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్ఎస్‌కె.ఖాజావలి అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సీనియర్ ఓటర్లను సన్మానించి వారికి పండ్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల లోపు ఎక్కువసార్లు ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లను సన్మానిస్తున్నామని తెలిపారు. ఓటును ఒక హక్కు, బాధ్యతగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తహశీల్దారు ఎవి.రమణరావు, డిప్యూటీ తహశీల్దారు బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, విఆర్‌ఒలు రవికిరణ్, శ్రీనివాస్, సీనియర్ సహాయకులు దావీదురాజు, బిఎల్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ నడయాడిన నేల ఇదేనా..!

ప్రజాశక్తి - డెస్క్



గాంధీ జయంతిని హింసకు వ్యతిరేకంగా, అహింసకు ప్రతిరూపంగా వాడవాడలా నిర్వహిస్తున్నారు. స్వచ్ఛతకు నిదర్శనంగా గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పాలకులు ఘనంగా చెప్పుకుంటున్నారు. అయితే స్వచ్ఛభారత్, స్వచ్ఛ తా హి సేవ పేరిట గాంధీ జయంతి సందర్భంగా రెండు మూడు రోజులు హడావుడి తప్ప క్షేత్రస్థాయిలో పల్లెలు కంపు కొడుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో జాతి పిత మహాత్మగాంధీకి వీడదీయలేని అనుబంధం ఉంది. జాతీయస్థాయిలో స్వాతంత్రోద్యమ కాలంలో ఉప్పు సత్యాగ్రహం విజయవంతమైన పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరం రెండో బార్డోలిగా గాంధీచే పిలవబడింది. దక్షిణభారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత ప్రముఖ ఆదర్శ నేతగా నేటికీ అందరిచే పిలవబడే పుచ్చలపల్లి సుందరయ్య ఉద్యమ ప్రస్థానం ఈ జిల్లాలోనే ప్రారంభమైంది. స్వాతంత్రోద్యమ కాలంలో జిల్లాలోని వివిధ పట్టణాల మీదుగా గాంధీ పర్యటన సాగిన సందర్భాలున్నాయి. ఈ క్రమంలో గాంధీ జయంతినాడు మహాత్ముని కలలు జిల్లాలో సాక్షాత్కరించాయో లేదో మనం పరిశీలిస్తే కొంత బాధాకరమైన సమాధానమే వస్తోంది.

నవ్యాంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాలు ఏర్పడ్డాక జిల్లాలో అనూహ్య రీతిలో నేరాలు పెరిగిపోయాయి. బాలికలపై, మహిళలపై వావీవరసలు మరచి అఘాయిత్యాల పరంగా హత్యలు, మోసాలు అదేస్థాయిలో నమోదవుతున్నాయి. మండవల్లిలో హాస్టల్లో ఉండి చదువుకుంటున్న బాలికను వరుసకు సోదరుడు, అతని పరిచయస్తులే చరబట్టడం.. అలాగే భీమవరం గాంధీనగర్‌లోని బాలికపై చిన్నాన్నే హత్యాచారానికి పాల్పడడం అందరినీ నివ్వెరపరచింది. నిర్భయ, దిశ వంటి చట్టాలతో మహిళల రక్షణకు కట్టుబడి ఉన్నామని పాలకులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు లేవనడానికి ఈ సంఘటనలే ప్రత్యక్ష నిదర్శనం. ఇదే సమయంలో పాలకులే హింసకు దిగడం, ప్రజలకు ఎక్కడ, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి కనిపిస్తోంది. గడప దాటి బయటకు వెళ్లిన మహిళలు, చిన్నారులు క్షేమంగా ఇంటికి తిరిగి వస్తారో లేదోగాని హక్కులపై ఉద్యమిస్తున్న నేతలు సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రజలు మాత్రం పోలీస్‌స్టేషన్లలోనూ, గృహాల్లోనూ నిర్బంధానికి గురవుతున్నారు. కనీసం గాంధీజీ తెలిపిన శాంతియుత నిరసనలకు సైతం ఈ పాలకులు అనుమతించకుండా గొంతు నొక్కే ప్రయత్నం చేయడం రెండు జిల్లాల్లోనూ కనిపిస్తోంది. గాంధీ వారసులమని చెప్పుకుంటూ ఆ గాంధీని హత్య చేసిన గాడ్సేను కొలిచే పాలకుల విధానాలు ఇందుకు భిన్నంగా ఉంటాయనుకోవడం అవివేకమే. ఇప్పటికైనా గాంధీ వరసులమని చెప్పుకోవడం మాని గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం లక్ష్య సాధన దిశగా హింసను ప్రేరేపించే విధానాలను పాలకులు వీడాలి. అదే సమయంలో ప్రభుత్వ రక్షకులుగా కాకుండా ప్రజారక్షకులుగా పోలీసులను తీర్చిదిద్దే విధానాలు అవలంభిస్తే ఎంతోకొంత గాంధీ కోరుకున్న శాంతి.. పచ్చని పశ్చిమగోదావరి జిల్లాలో కనిపించే అవకాశం ఉంది.

గాంధీ జయంతి సందర్భంగానే స్వచ్ఛభారత్ పేరిట కొంతకాలంగా బిజెపి పాలకులు హడావుడి చేస్తున్నారు. దానికి అనుగుణంగా రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్ అంటూ ప్రజలపై చెత్త పన్ను వేసి ఘనతను చాటుకుంది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా అన్నిచోట్లా పేరుకుపోయిన చెత్త, క్షీణించిన పారిశుధ్యంతో కంపుకొడుతున్నాయి. భీమడోలు, విస్సాకోడేరు వంటి ప్రాంతాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పేరిట కొంత పారిశుధ్యం మెరుగుకు గట్టి కృషి జరుగుతుంది. అయితే ఇవన్నీ వేళ్లపై లెక్కగట్టగలిగిన గ్రామాలే. పట్టణాల్లో ఒక మోస్తరు వర్షం కురిస్తే మురుగునీరు వెళ్లే మార్గం లేక రోడ్లపైకి చేరుతుంది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో అయితే గ్రామంలో అడుగు పెట్టేటప్పుడే ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. దీనికి ప్రధాన కారణం డంపింగ్ యార్డులు లేకపోవడమే. ఇప్పటికీ చాలా గ్రామాల్లో డంపింగ్‌యార్డుల ఏర్పాటు ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. దీంతో పంచాయతీలు సైతం ఏమీ చేయలేక గ్రామ శివార్లలో చెత్తను పారబోస్తున్నాయి. స్వచ్ఛభారత్ అంటే అంతా స్వచ్ఛంగా ఉండాలి తప్ప గాంధీ జయంతి రోజునే ఉంటే సరిపోదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేయడంతో పాటు పంచాయతీలకు చెందాల్సిన నిధులను సక్రమంగా విడుదల చేసి గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి బాటలు వేయాలని అంతా కోరుతున్నారు.

వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట



ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కొత్త జిల్లాల ఏర్పాటుతో ఏలూరు జిల్లా ఆరోగ్యపరంగా సంక్లిష్టంగా మారింది. ఒక పక్క గోదావరి పరివాహక ప్రాంతం, కొల్లేరు ఉండగా, ఎక్కువ భాగం మెట్ట, అటవీ గిరిజన ప్రాంతాలున్నాయి. దీంతో వ్యాధుల తీవ్రత ఎక్కువగానే ఉంది. ప్రధానంగా సీజనల్ వ్యాధులకు మూల ప్రాంతాలుండటం, సిబ్బంది సర్దుబాటులో ఇతర జిల్లాలకు తరలిపోవడంతో వ్యాధులను అదుపు చేయడం కొంత కష్టంగా మారుతోంది. రెండు నెలలుగా వైరల్ జ్వరాలతోపాటు, సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ ఎస్.శర్మిష్ట ఇటీవల బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో వైదుల నియంత్రణకు పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నట్టు ఆమె 'ప్రజాశక్తి' ముఖాముఖిలో తెలిపారు.

ప్రశ్న : జిల్లాలో పెరుగుతున్న వ్యాధుల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. ఆగస్టులో ఇంటింటా సర్వే చేయించాం. మలేరియా, టైఫాయిడ్ అధికంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా నిధులు వెచ్చించి మందులు అందుబాటులో ఉంచాము. 50 చోట్ల ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశాము. ఎక్కడ ఎలాంటి ఇబ్బందీ లేకుండా చర్యలు తీసుకున్నాము.

ప్రశ్న : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు తీరు ఎలా ఉంది?

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 25 శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. పెదపాడుమండలం కలపర్రులో ట్రయల్ రన్ నిర్వహించాం. అన్ని కార్యక్రమాల మాదిరిగా కాకుండా శిబిరాల్లో స్పెషలైజేషన్ వైద్యులు పరీక్షలు నిర్వహించి, మందులిస్తారు. ఆపరేషన్‌లు, అత్యవసర సేవలకు కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తారు. చికిత్స అనంతరం క్షేత్రస్థాయి సిబ్బంది ఫాలోఅప్ చేస్తారు. ఇప్పటికే ఇంటింటి సర్వేలో షుగర్, బిపి, ఇతర వ్యాధులు గుర్తించాం. రోగి నమోదు నుంచి 104 ద్వారా రోగి వైద్యుని సంప్రదించాల్సిన రోజు, సమయం.. ఫోన్ ద్వారా సమాచారం ఇస్తారు. ఇలా



ప్రతివ్యక్తికీ సమగ్ర వైద్యం అందిస్తున్నాం. శిబిరాల వద్దే ఇసిజి కూడా తీసి గుండె వైద్యులతో పరీక్షలు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఎంత వరకు సఫలీకృతమైంది.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఎంతో విజయవంతంగా నడుస్తోంది. విలేజ్ క్లినిక్ సిబ్బంది, ప్రత్యేక వైద్య బృందం ఇంటింటికీ వెళ్లి వైద్యం అందిస్తున్నారు. దీన్ని మరింత పటిష్టవంతంగా చేపట్టేందుకు చర్యలు చేపట్టాం.

నాగేంద్రనాథ్ మృతి తీరనిలోటు : సిపిఎం

కలిదిండి: రైతాంగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు యెర్నేని నాగేంద్రనాథ్ మృతి రైతులకు తీరని లోటని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రవి అన్నారు. మండలంలోని కొండూరులో నాగేంద్రనాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేంద్రం తీసుకు వచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ రైతులకు మద్దతుగా నిలిచారని, రైతులకు గిట్టుబాటు ధర చట్టం కోసం రైతు ఉద్యమాల్లో పనిచేసిన సమయంలో ఆయనతో కలిసి పాల్గొన్నట్లు రవి తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న కలెక్టర్

'స్వచ్ఛ తా హి సేవ'లో ప్రతిఒక్కరూ పాల్గొనాలి

శ్రమదానం చేసిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

సంపూర్ణ పారిశుధ్యంపై అవగాహన కలిగి పరిసరాల పరిశుభ్రతపై మరింత చైతన్యం కల్పించేందుకు 'స్వచ్ఛ తా హి సేవ' కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. ఆదివారం ఏలూరు రురల్ మండలం మల్కాపురంలో స్వచ్ఛ తా హి సేవ కార్యక్రమంలో పాల్గొని స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి కలెక్టర్ శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలశక్తి, హౌసింగ్, అర్బన్ వ్యవహారాల మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో గతనెల 15వ తేదీ నుండి ఈనెల రెండో తేదీ వరకూ దేశంలోని అన్ని గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లో ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మల్కాపురం గ్రామంలో స్థానిక గ్రామ సర్పంచి, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి శ్రమదానం చేశామన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే పట్టణాలు, గ్రామాలు ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యా టమ్నాయాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సూర్యనారాయణరెడ్డి, డిపిఒ తూతిక విశ్వనాథ్ శ్రీనివాస్, డివిజనల్ పంచాయతీ అధికారి చంద్రశేఖర్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి కుముదినీసింగ్, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ ప్రణవి, గ్రామ సర్పంచి పి.సునీత, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ తా హి సేవ'లో జిల్లాకు ప్రథమ స్థానం

అందరి భాగస్వామ్యం, సమిష్టి కృషితోనే సాధ్యం : కలెక్టర్

ప్రజాశకిత - ఏలూరు



మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన "స్వచ్ఛ తా హి సేవ" శ్రమదాన కార్యక్రమంలో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలోని 735 గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, శ్రమదానం వంటి 1470 కార్యక్రమాలను నిర్వహించాలనే లక్ష్యానికి 1996 కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నూరుశాతం పైగా లక్ష్యాలను సాధించి రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన ప్రతిఒక్కరికీ ఈ సందర్భంగా కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఏక్ తారిక్-ఏక్ గంటా-ఏక్ సాత్ కింద 'స్వచ్ఛ తా హి సేవ', 'స్వచ్ఛ పక్వాడ' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఇతర సిబ్బందికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో జిల్లాను అన్నిరంగాల్లో ముందడుగు వేసేలా ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాలో 11,328 కార్యక్రమాలు స్వచ్ఛతా హి సేవా కింద పూర్తిచేయగా నాలుగు లక్షల 47 వేల 522 మంది 21 లక్షల 67,677 గంటల పాటు పనిచేయడంతో జిల్లాకు మొదటి స్థానం లభించిందన్నారు. ఈ కార్యచరణలో భాగంగా 9,602 చిత్రాలు సంబంధిత పోర్టల్లో అప్ లోడ్ చేయబడ్డాయని తెలిపారు.



మాట్లాడుతున్న నారపల్లి రమణరావు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కలిదిండి

రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసిన నిర్మాణరంగ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణరావు డిమాండ్ చేశారు. స్థానిక మార్కెట్‌యార్డ్‌లో ఆ సంఘ నాయకులు పోతురాజు బాలాజీ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది. ప్రభుత్వం వాడుకున్న రూ.రెండు వేల కోట్లను సంక్షేమ బోర్డుకు జమచేయాలని, 1214 మెమోను రద్దు చేయాలని, కార్మికుల సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు సంఘటితం కావాలన్నారు. నాయకులు పరసా రాజేష్, పి.బాలాజీ, కటికల శ్రీను, బి.సూరిబాబు, చిలక సురేష్, శ్రీకాంత్, మహేష్, కె.ధనరాజ్, మనోహర్ పాల్గొన్నారు.

రైతులకు హమాలీ ఛార్జీలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గత ఖరీఫ్, రబీ పంటకాలంలో ధాన్యం అమ్మిన రైతులకు ఇవ్వాల్సిన హమాలీ ఛార్జీలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుంకరవారితోటలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మిన రైతులకు ప్రభుత్వమే హమాలీ ఛార్జీలు చెల్లిస్తోందని చెప్పారు. ముందుగా రైతులే హమాలీలకు ఎగుమతి కూలి చెల్లిస్తే ఆ తర్వాత ప్రభుత్వం చెల్లిస్తోందని అయితే ప్రభుత్వం ఇచ్చే హమాలీల ఛార్జీలు సరిపోక అదనంగా రైతు భరించాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం నుండి రావాల్సిన హమాలీ ఛార్జీల బకాయిలు చెల్లించకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హమాలీ ఛార్జీల బకాయిలు విడుదల చేసి రైతులకు వెంటనే చెల్లించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి లక్ష్మణరావు, కె.జయరాజు, టి.జగదీష్ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా రేషన్ సరఫరా..!

పూర్తిస్థాయిలో అందని బియ్యం - లబోదిబోమంటున్న కార్డుదారులు


ప్రజాశక్తి - ముదినేపల్లి



రేషన్ కార్డుదారులకు ప్రతినెల ఎమ్‌డియు వాహనం ఆపరేటర్ ద్వారా అందిస్తున్న ఇంటింటా రేషన్ పంపిణీ అస్తవ్యస్తంగా తయారవుతోంది. కార్డుదారులకు ప్రతినెలా సక్రమంగా రేషన్ బియ్యం అందక నానాఅవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా గత మూడు నెలలుగా ముదినేపల్లి-1 సచివాలయం పరిధిలోని కార్డుదారులకు పూర్తిగా రేషన్ పంపిణీ జరగడంలేదంటూ కార్డుదారులు ఆరోపిస్తున్నారు. మూడు నెలలుగా సూమారు 150 కార్డులకు రేషన్ పంపిణీ జరగడంలేదని కార్డుదారులు చెబుతున్నారు. దీంతో జనం రేషన్ ప్రతీనెల తమకు ఇస్తారో, లేదో అంటూ ఎదురుచూడాల్సి వస్తుంది. రేషన్ తక్కువగా రావడంతో ఆపరేటర్ గ్రామంలోని ఒక్కో ఏరియాలో ఒక్కో నెల 150 కార్డులకు రేషన్ నిలుపుదల చేస్తున్నాడు. రేషన్ అందని కార్డుదారులు నానా అవస్థలు పడుతున్నారు. మూడు నెలలుగా గ్రామంలో రేషన్‌కోత విధిస్తున్నారు. ముదినేపల్లిలో రెండు గ్రామ సచివాలయాలున్నాయి. ముదినేపల్లి-1 సచివాలయంలో 750 కార్డులున్నాయి. వీటిలో 600 కార్డులకే రేషన్ విడుదల చేస్తున్నారు. మిగతా కార్డుదారులకు స్టాక్‌పాయింట్ నుంచి రేషన్ రావడంలేదు. దీంతో ప్రతీనెల 150 కార్డులకు రేషన్ కోత పడుతోంది. గ్రామంలో పూర్తిస్థాయిలో రేషన్ పంపిణీ జరగకపోవడంతో కార్డుదారులు లబోదిబోమంటున్నారు. ముదినేపల్లి-2 సచివాలయంలోని కార్డుదారులందరికీ రేషన్ ఇస్తున్నారని, ముదినేపల్లి-1 సచివాలయానికి ఎందుకు రేషన్ కోత విధిస్తున్నట్లు అని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై రేషన్ డిపో డీలర్‌ను వివరణ కోరగా మూడు నెలలుగా 150 కార్డులకు రేషన్ సరఫరా ఉన్నతాధికారుల వద్దే నిలిచిపోయిందన్నారు. దీనిపై పలుసార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినా రేపు, మాపు రేషన్ వస్తుందంటూ చెబుతున్నారే తప్ప రేషన్‌మాత్రం రావడంలేదన్నారు. ప్రతీనెల 150 కార్డులకు రేషన్ ఇవ్వలేకపోతున్నట్లు తెలిపారు. దీనిపై పిడిఎస్ డిటి స్వర్ణలతను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రేషన్ సరఫరా చేసి పేదల ఆకలిబాధలు తీర్చాలని కార్డుదారులు కోరుతున్నారు.

కొనసాగిన టిడిపి నేతల నిరసన దీక్షలు

ప్రజాశక్తి - జంగారెడ్డి గూడెం



జంగారెడ్డిగూడెంలో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న నేతలు

చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా పట్టణ, మండల టిడిపి కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 19వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం మండలంలోని గురవాయిగూడెం దీక్షా శిబిరంలో అర్ధనగ్న, నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. మండల టిడిపి అధ్యక్షులు సాయిల సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి, వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చేస్తుందన్నారు. వెంటనే చంద్రబాబు నాయుడుని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు గోలి అనిల్, బొమ్మజి అనిల్, సొంగా రోషన్ కుమార్, రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రామారావు, పెనుమర్తి రామ్ కుమార్, బొబ్బర రాజ్ పాల్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మండలంలోని అల్లూరు గ్రామంలో ఆదివారం టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దావు నాగరాజు ఆధ్వర్యంలో గ్రామ ప్రధాన సెంటర్‌లో ఉన్న అంబేద్కర్, ఎన్‌టి రామారావు విగ్రహాల వద్ద కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు సైకో పోవాలి - సైకిల్ రావాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల రామచంద్రరావు, పార్టీ నాయకులు బొమ్మనబోయిన రత్నం, నీలిపల్లి సన్యాసిరావు, ముంద్రు బాలరాజు, దాసరి శ్రీను, పెరుమాళ్ల రామ్మోహనరావు, శీలం చిన్న, వెంకటేశ్వరరావు, కులమట్ల రాము, బోయిన ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా మండలంలోని వణుదుర్రులో ఆదివారం టిడిపి శ్రేణులు ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. భవిష్యత్ గ్యారంటీ, బాబుతో నేను కొడాలి వినోద్ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పార్టీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు.

ముసునూరు : చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆదివారం వినూత్న రీతిలో న్యాయానికి కళ్లు లేవుంటూ, ధర్మానికి, చట్టానికి న్యాయం లేదంటూ మెడకు ఉరితాళ్లు, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గద్దే రఘుబాబు, కందుల పిచ్చియ్య, తోట శ్రీనివాసరావు, పాకనాటి సీతారామ్, లక్కపాము కాంతారావు, గార్లపాటి నరిసింహారావు, కోండుబోయిన నాగు, నక్కా యోహాన్, చింతా రాఘువులు, రెడ్డి కృష్ణ పాల్గొన్నారు.



సుందరయ్య స్తూపం ఆవిష్కరిస్తున్న నాయకులు

పాలకులకు సుందరయ్య ఆదర్శం

స్మారక స్తూపం ప్రారంభంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - తణుకు రూరల్

నాడు సుందరయ్య తన ఆస్తిని పేదలకు పంచితే నేటి పాలకులు ప్రజల సంపదను దోచుకుంటున్నారని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆదివారం తణుకు మండలం వేల్పూరు బైపాస్ రోడ్‌లో నిర్మించిన పీడిత ప్రజల ఆశాజ్యోతి, స్వాతంత్ర సమరయోధులు పుచ్చలపల్లి సుందరయ్య స్మారక స్తూపాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ పేదలపై భారాలు మోపుతూ కార్పొరేట్లకు రూ.కోట్లు దోచిపెడుతున్నారని విమర్శించారు. నాడు సుందరయ్య పార్లమెంట్‌లో ప్రజల సమస్యలను లేవనెత్తి బయట ప్రజాపోరాటాలు నిర్వహించే వారన్నారు. ఈ సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక కార్మికుల, కర్షకుల, హక్కులను, చట్టాలను కాల రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక న్యాయస్థానాలను కూడా ప్రభావితం చేస్తూ పేదలకు నష్టం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు, కె.సోమరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసే విధంగా పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. శ్రామిక మహిళ జిల్లా నాయకులు ఎ.అజయకుమారి, జక్కంశెట్టి వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఒకపక్క మహిళల హక్కులను హరిస్తూ మరోపక్క మహిళా బిల్లు ప్రవేశ పెట్టడం సిగ్గుచేటన్నారు. ఈ సభలో మండల కార్యదర్శి దొంగల నాగేశ్వరరావు ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ వలి, బి.చైతన్య ప్రసాద్, వాసా వెంకటేశ్వరావు, పూతినీడి పద్మ, కె.అర్జున్, వాసా పోసియ్య, కె.నరసింహారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

సమాజంలో అన్ని వర్గాల సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ఎంఎల్‌ఎ ఆళ్ల నాని తెలిపారు. దేవాంగ సంక్షేమ సంఘం, నూర్ భాషా సంక్షేమ సంఘం వారు ఆళ్ల నానిని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలపై వినతిని అందించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గ పరిధిలో శుభకార్యాలకు, తదితర కార్యక్రమాలకు అనువుగా ఆయా వర్గాలకు సామాజిక భవనాల నిర్మాణం కోసం స్థలాలు కేటాయిస్తున్నామని తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలాలు మంజూరు చేసిన ఆళ్లనానికి ఆయా సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, షేక్ సత్తార్, గాజుల బాజి, అలంకార్ సుభాని, బాషా, ఫరీద్ బళ్లా రవి కుమార్, బి.పూర్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో వర్షం


ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. ముదినేపల్లితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు కాలనీలకు వర్షపు నీరు చేరడంతో కాలనీ వాసులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. ప్రతిరోజు ఏదో సమయంలో కురుస్తున్న వర్షాలు మండలంలోని సార్వ, వరి సాగుకు ఉపయోగకరంగా ఉండడంతో పాటు రైతులకు ఊరట కలిగిస్తున్నాయి. ఈ వర్షం సార్వ వరి చేలకు జీవం పోసినట్లైందని పలువురు రైతులు చెబుతున్నారు.

నేడు గాంధీ జయంత్యుత్సవ సభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


స్వాతంత్ర సమరయోధుడు జాతిపిత మహాత్మా గాంధీ 154 జయంతిని సోమవారం ఉదయం 9 గంటలకు ఏలూరు ఆర్ఆర్ పేట పల్లపు తోటలోని గాంధీ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సమావేశం జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కో కన్వీనర్ గొల్ల కృష్ణారావులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేతి వృత్తిదారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.


శ్మశానవాటికలో మందు పిచికారి చేయిస్తున్న సర్పంచి

శ్మశానవాటికలో పురుగుల మందు పిచికారీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ఎస్సి శ్మశాన వాటికలో పంచాయతీ ఆధ్వర్యంలో పిచ్చిమొక్కలు నిర్మూలనా మందును పిచికారి చేశారు. ఇటీవల వరసగా కురుస్తున్న వర్షాలకు శ్మశాన వాటికలో దట్టంగా పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగాయి. వాటి కారణంగా శ్మశానంలో పాముల సంచారం కూడా అధికమైంది. మృతదేహాలను ఖననం చేసే సమయంలో తరచూ విషసర్పాలు కనబడడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఈ విషయం సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యను పరిష్కరించేందుకు వెంటనే సర్పంచి రూ.4వేలు విలువ చేసే మందును కూలీలతో శ్మశాన వాటికలో పిచికారి చేయించారు. పిచికారి పనులను క్రైమ్య వైసిపి నేత నిమ్మగడ్డ భిక్షాలు దగ్గర ఉండి పర్యవేక్షించారు.


హెచ్ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

హెచ్‌ఎంకు ఘన సన్మానం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని యనమదల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నియోజకవర్గ కాంప్లెక్స్ అయిన తరువాత యనమదల ప్రధానోపాధ్యాయుడు నాగరాజును ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల వ్యాయామ ఉపాధ్యాయున్ని ఉపాధ్యాయులు ఘణంగా సన్మానించారు. నియోజక వర్గ ఇన్‌ఛార్జి రవీంద్ర మాట్లాడుతూ స్కూల్‌కు కొన్నివేల రూపాయిలు విద్యార్థుల కోసం ఖర్చు పెట్టామని తెలిపారు. సన్మాన గ్రహీత నాగరాజు మాట్లాడుతూ నా ఉద్యోగ జీవితంలో ఎన్నో కాంప్లెక్స్‌లకు వెళ్లానని తెలిపారు. ఉదయం అసెంబ్లీ కార్యక్రమము నుంచి సాయంత్రం వరకు కార్యక్రమాలు ఎంతో ప్రశాంతతో, నియమ నిబంధనలతో నిర్వహించారని వ్యాయామ ఉపాధ్యాయులను కొనియాడారు. శారీరక ఉల్లాసానికి ఆటలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, సుకుమార్, శివ వనజ, లక్ష్మి పాల్గొన్నారు.


వాలీబాల్ కిట్లు అందజేస్తున్న వైసిపి నాయకులు

వాలీబాల్ కిట్లు అందజేత

ప్రజాశక్తి - పోలవరం

టిబిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు మండలంలోని పాత పట్టిసీమలో వాలీబాల్ కిట్లను యువతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం వైసిపి యువ నాయకులు పొడుం శ్యామ్ కుమార్, మండల సచివాలయ కన్వీనర్ మాదేపల్లి సాయి రామకృష్ణ, ఈదేపల్లి వెంకట గణేష్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

శరవేగంగా ప్రహరి నిర్మాణం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని చేవూరు గ్రామంలోని వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ప్రహరి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామ ప్రముఖులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టారు. వెంకట్రావు తన సొంత నిధులు వెచ్చించి ప్రహరి నిర్మాణం చేస్తున్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గణేష్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని చేవూరిపాలెం, పెదపాలపర్రు, ముదినేపల్లి తదితర గ్రామాల్లో గణేష్ నిమజ్జనాలు చేశారు. ముదినేపల్లిలోని వైకూడలి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని డప్పు వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు చేశారు. ఈ ఊరేగింపులో పెద్ద ఎత్తున యువకులు, పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.

టెండర్ల ఆహ్వానం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని కోట మహిషాసుర మర్ధని ఆలయంలో దసరా వేడుకలకు ఎలక్ట్రికల్ డెకరేషన్, పూల డెకరేషన్, సీసీ కెమెరాలు, సన్నాయి మేళం, బేతాళ సెట్‌లు, లోపల సెక్యూరిటీ గార్డ్స్, రంగులు, పూలదండలు, ప్రసాదం తయారీకి టెండర్లు పిలుస్తున్నట్లు దేవాలయ ఇఒ యార్లగడ్డ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండర్ కొటేషన్స్ ఈనెల 4వ తేదీ ఉదయం 11 గంటల లోపు స్వీకరించబడునన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2.30లకు కొటేషన్స్ తెరిచి ఖరారు చేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు చింతలపూడి గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ తెలిపారు. అండర్-14 వాలీబాల్ విభాగంలో తుమ్మలపల్లి నిఖిల్, అండర్-17 డిస్క్‌త్రో విభాగంలో తాళ్లూరి భార్గవ్, అండర్-17 చాలెన్‌త్రో విభాగంలో తగరం మహేష్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు.


భీమడోలులో..


ద్వారకాతిరుమల

ఉత్సాహంగా 'స్వచ్ఛతా హి సేవ'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పరిశుభ్రత అనేది ఒక అలవాటుగా మారాలని, ఇల్లు, పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా ఎంతో ముఖ్యమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాద్‌రావు తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు స్వచ్ఛ భారత్‌లో భాగంగా శ్రమదానంను రెడ్‌క్రాస్ కార్యాలయం ఆవరణలో సంస్థ సిబ్బంది ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వాలంటీర్లు, ఎఎన్ఎం, నర్సింగ్ విద్యార్థినిలు శ్రమదానం చేశారు.


ఏలూరు బస్టాండ్ ఆవరణలో శ్రమదానం చేస్తున్న ఆర్‌టిసి అధికారులు

ఏలూరు ఎపిఎస్ఆర్‌టిసి బస్టాండ్, జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి వారి కార్యాలయంలో బయట ఉన్నటువంటి మొక్కలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి ఎన్‌విఆర్ వరప్రసాద్, ఆఫీసు సూపర్‌నెంట్ పి.వేణుగోపాలరావు, ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి పాల్గొన్నారు.

ఇరిగేషన్ కార్యాలయాల సమూహంలో పశ్చిమగోదావరి జిల్లా ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. కార్యాలయాల ఆవరణలో పేరుకు పోయిన చెత్త, పిచ్చిమొక్కలని తీసివేసి పరిసరాలను శుభ్రపరిచారు.

భీమడోలు: మండలంలోని పలు గ్రామాలలో 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు ఆదివారం ఒక గంట సమయం శ్రమదానం చేశారు. మండల స్థాయిలో స్థానిక ఎస్‌కెఎఆర్ఎం జూనియర్ కళాశాల వేదికగా తొలుత ప్రారంభించిన శ్రమదాన కార్యక్రమంలో భీమడోలు జెడ్‌పిటిసి తుమ్మగుంట భవాని రంగ, సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పి.సునీత మాన్సింగ్, ఎంపిడిఒ సిహెచ్ పద్మావతి దేవి, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో కళాశాలకు చెందిన విద్యార్థులు, ప్రిన్సిపల్ బాలు, ఇతర సిబ్బంది భాగస్వాములయ్యారు.

పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని అన్ని ప్రభుత్వ, పంచాయతీలలో పరిసరాలను, రోడ్లను, బస్టాండ్లను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిల సంఘ అధ్యక్షులు, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, పోలవరం పంచాయతీ ప్రెసిడెంట్ పొడుం పుష్ప, తహశీల్దార్ బి.సుమతి, ఎంపిడిఒ జి.శ్రీను, గూటాల సర్పంచి ప్రసాద్, కొత్త పట్టిసీమ సర్పంచి మైగాపుల విజయదుర్గ పాల్గొన్నారు.


ముసునూరులో..

నూజివీడు రూరల్ : మండలంలోని రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు సిబ్బంది స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ, రూరల్ సిఐ బాల సురేష్ పర్యవేక్షణలో శ్రమదానం చేశారు. మండలంలోని రావిచర్ల గ్రామపంచాయతీ సర్పంచి కాపా శ్రీనివాసరావు పరిసరాల పరిశుభ్రతను పాటించటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.


చింతలపూడిలో..

చింతలపూడి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబు తెలిపారు. స్వచ్ఛత హి కార్యక్రమం ఎంపిడిఒ మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పాత బస్టాండ్ వరకు వీధులను శుభ్రం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి విక్టర్ బాబు, హౌసింగ్ ఎఇ, ఎంపిపి రాంబాబు, వైసిపి నగర అధ్యక్షుడు కొప్పుల నాగు, రాజ్ ప్రకాష్ పాల్, బిజెపి నాయకులు నారాయణ

ఉంగుటూరు: నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కాలేజిలో సర్పంచి దిడ్ల అలకనంద ఆధ్వర్యంలో శ్రమదానంతో చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో భాజాపా నాయకులు శరణాల మాలతీరాణి, అడపా శోభారాణి, పంచాయతీ కార్యదర్శి జె.నాగేశ్వరరావు, ఎంపిడిఒ కార్యాలయం ప్రాంగణంలో సర్పంచి బండారు సింధు, ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, అధికారులు శ్రమదానం నిర్వహించారు.

జీలుగుమిల్లి: స్థానిక తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ సుందర్ సింగ్, ఎంపిడిఒ కృష్ణప్రసాద్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో సూపరింటెడెంట్ మంగతాయారు, సర్పంచి వనమా రాంబాబు, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శిలు అశోక్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెక్కలం గొల్లగూడెం గ్రామంలో జడ్‌పిటిసి పి.వీరబాబు, ఎంపిటిసి జి.శ్రీనివాసరావు, సర్పంచి, ఎల్.రమేష్, అడవి నెక్కలం సర్పంచి, వి.రాజు, ఇఒపిఆర్‌డి సిహెచ్.శేఖర్, ఆగిరిపల్లిలో ఎంపిడిఒ పి.శంకరరావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: చిన్న వెంకన్న సన్నిధి నుంచి పంచాయతీ ఆఫీస్ వరకు అధికారులు, నాయకులతో కలిసి రోడ్లను శుభ్రపరిచారు. అనంతరం గ్రామాల్లో పరిశుభ్రత గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి కుంటం స్వర్ణలతా సతీష్, జడ్‌పిటిసి చిగురుపల్లి సామిల్, సుబ్బారాయన్, ఎంపిడిఒ తిరుమలరావు, ఎంఆర్ఒ సతీష్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కలిదిండి : స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక బిసి బాలికల వసతి గృహం చుట్టుపక్కల పరిసరాలను మెడికల్ సెల్ జిల్లా కన్వీనర్ బండారు వెంకట రాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు పి.ముసలయ్య, ఎన్.సుబ్రమణ్యం, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పరమేష్, అభిలాష్, దుర్గాప్రసాద్, మనోహర్, శ్రవణ్, తులసీరావు, నిఖిలేష్, హాస్టల్ సిబ్బంది లంకమ్మ, నాగరాణి, జపమాల, హాస్టల్ విద్యార్థులు శుభ్రపరిచారు.


ముసునూరు : స్వచ్ఛత హి సేవలో భాగంగా ఇంటి పరిసరాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. స్వచ్ఛత హి సేవాలో భాగంగా క్లిన్ అండ్ గ్రీన్ చేసి, మొక్కలు నాటినట్లు ఎపిఒ టి.రోజ్‌లీలా తెలిపారు.


పోలవరంలో..


ఆగిరిపల్లిలో..


జీలుగుమిల్లిలో..

ఘనంగా ప్రపంచ వృద్ధుల దినోత్సవం


వృద్ధులను సత్కరిస్తున్న గుండుగొలను పంచాయతీ కార్యదర్శి, ప్రముఖులు

ప్రజాశక్తి - భీమడోలు

సీనియర్ సిటిజన్ల అనుభవాలను అన్వయించుకొని, వారి సూచనలను పాటించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చునని గుండుగొలను గ్రామపంచాయతీ కార్యదర్శి వి.మురళీకృష్ణ తెలిపారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని పంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వంద సంవత్సరాల వయసుకు చేరుకుంటున్న దాట్ల నరేంద్రరాజు దంపతులను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పాలకవర్గం సహాయ సహకారాలతో అర్హులైన ప్రతి సీనియర్ సిటిజన్‌కు ప్రభుత్వ పరంగా కేటాయించిన పలు పథకాల అమలు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా గ్రామ పరిధిలో 900 వరకు వృద్ధాప్య పింఛన్లను అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండుగొలను గ్రామ రెవెన్యూ అధికారి కె.శంకర్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : తహశీల్దార్ పాశం నాగమణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధ ఓటర్స్‌ను ఆదివారం సన్మానించారు. 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నూజివీడు రూరల్ : పట్టణంలో పర్యావరణాన్ని కాంక్షిస్తూ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయులు, మధురకవి ఏమని శేషయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను విడనడాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ భూతం క్యాన్సర్ వంటి అనేక దీర్ఘకాలిక వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. చెట్లు పెంపకంతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

చింతలపూడి: వృద్ధాప్యంలో ఉన్న పెద్దవారిని జాగ్రత్తగా చూసుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యతని తహశీల్దార్ కృష్ణజ్యోతి తెలిపారు. పట్టణంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 80 సంవత్సరాలు పైబడిన పలువురు వృద్ధులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, బూత్ లెవెల్ అధికారులు, ఇతర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక గిరిజన భవనంలో విభిన్న ప్రతిభావంతుల, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహనా సమావేశము నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అదనపు కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కెకెవి బులి కృష్ణ మాట్లాడుతూ మనుషుల మధ్య సంబంధాలు తగ్గటం వల్ల వృద్ధుల సంక్షేమ శాఖ ఏర్పాటు చేయల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల సీనియర్ సిటిజన్స్, సివిల్ సప్లై ఆఫీసర్, డిసిపిఒ పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా రుణాల మంజూరు : పాపారావు బాబ్జీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు విశాల సహకార సంఘం (నారాయణపురం సొసైటీ) రైతులకు రుణాలు ఇవ్వడంలో జిల్లాకు ఆదర్శంగా ఉన్నామని త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్ యెలిశెట్టి పాపారావు బాబ్జి తెలిపారు. సొసైటీ సర్వసభ్య సమావేశం బాబ్జి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గతంలో ధాన్యం కొనుగోలులో అనేక ఇబ్బందులు ఎదుర్కొనే వారమని ఈ సొసైటీ ద్వారా ఎలాంటి సమస్యలూ రాకుండా రైతులకు ధాన్యం హమాలీ ఛార్జీలతో సహా డబ్బులు రైతుల ఖాతాలోకి జమ అయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. బాబ్జి మాట్లాడుతూ ఈ సొసైటీలో తాను ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ నాలుగేళ్ల కాలంలో కౌలు రైతులు, దీర్ఘ, స్వల్ప కాలిక రుణాలు, గోల్డ్‌లోన్స్ తదితర రుణాలను గణనీయంగా పెంచి రూ.36 కోట్లకుపైగా రుణాలు అందించామన్నారు. నికర లాభాన్ని రూ.1.78 కోట్లతో అభివృద్ధిలో జిల్లాలో మొదటి స్థానంలో నారాయణపురం సొసైటీని నిలపడంలో ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు సహకారంతోనే ఇదంతా సాధ్యం చేయగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు దాసరి సత్యనారాయణ, సూరే ఏడు కొండలు, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, సొసైటీ కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, రైతులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

విద్యార్థులపై ప్రిన్సిపల్ లైంగిక వేధింపులు

చింతలపూడి : చింతలపూడిలో అమానుష సంఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని ఆర్‌కె స్టడీ సర్కిల్‌లో నవోదయ కోచింగ్ సెంటర్ వద్ద కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులపై ప్రిన్సిపల్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని తల్లితండ్రులు ఆరోపించారు. రాత్రి పది దాటిన తర్వాత విద్యార్థులను లైంగికంగా వేధిస్తున్నాడని, బాధిత విద్యార్థులు చెబుతున్నారు. మగపిల్లలను సైతం విడిచిపెట్టకపోవటంతో ఆడపిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలువురు విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పడంతో ఈ విషయం బయటపడింది. దీంతో ఆర్‌కె స్టడీ సర్కిల్ సెంటర్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించారు. ప్రిన్సిపల్ రవి కిరణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి తల్లితండ్రులు వెళ్లారు.

కానిస్టేబుల్‌పై యువకుడు దాడి పరిస్థితి విషమం


ఆగిరిపల్లి: మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో శనివారం రాత్రి గణేష్ నిమజ్జన కార్యక్రమంలో విధి నిర్వహణలో వున్న కానిస్టేబుల్ గంధం నరేంద్రను ఆగిరిపల్లికి చెందిన ఒక యువకుడు కర్రతో బలంగా కొట్టడంతో కుప్పకూలిపోయి, అపస్మారక స్థితిలోకి వెళ్లారు. కానిస్టేబుల్‌ను విజయవాడ అను ఆసుపత్రికి తరలించి, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో వైద్య సేవలు అందజేస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా వుందని సమాచారం. దాడిచేసిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

జీలుగుమిల్లి: మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దర్భగూడెం పంచాయతీ పరిధిలోని కొత్త కోయిదా ఆర్‌అండ్‌ఆర్ నిర్వాసిత కాలనీలో ఓ మహిళ కొంతకాలం క్రితం భర్త చనిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై శనివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. స్థానికులు గమనించి ఆమెను జంగారెడ్డి గూడెంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో అదేరోజు రాత్రి చనిపోయినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కోడి వ్యర్థాల వాహనాలు సీజ్

ఏలూరు టౌన్: అక్రమంగా నిషేధిత కోడి వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలను రైడ్ చేసినట్లు పెదవేగి సిఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ చల్లా కృష్ణ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం పెదపాడు గ్రామం గండి చెరువు గట్టు వద్ద ఒక ఐషర్, గుడుపాడు గ్రామ శివారు వద్ద ఒక ఐషర్, ట్రాక్టర్‌ను పట్టుకుని రెండు కేసులు నమోదు చేసి, సుమారు 18 టన్నుల కోడి వ్యర్థాలను సీజ్ చేశామన్నారు. సదరు వాహన యజమానులు, చేపల చెరువుల యజమానులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న ఆవులు

ఆవులను రక్షించిన పోలీసులు

ముసునూరు: కబేళానికి తరలిస్తున్న ఆవులను పోలీసు శాఖాధికారులు ఆదివారం రక్షించారు. నూజివీడు ఏరియాలో బైపాసు రోడ్డుపై రెండు లారీల్లో 120 ఆవులను విజయనగరం, గజపతి నగరం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నూజివీడు రాజకీయ ప్రముఖులు రామిశెట్టి మురళీ కృష్ణకుమార్, వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ ఇరువురు కలిసి నూజివీడు సిఐ మూర్తి, టౌన్ ఎస్ఐ వెంకటేష్‌ల ఆధ్వర్యంలో ముసునూరు జిల్లా పరిషత్ వున్నత పాఠశాలకు తరలించారు. వాటిలో ఒకటి మృతి చెందగా, మూడు ఆవులకు చిన్న, చిన్న గాయాలయ్యాయి. లారీ యాజిమాని, డ్రైవరుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE :: ELURU
O.S.NO.71/2015

Between:
Yelika Veeramma ***...Plaintiff***
Vs
1) Gayam Bajramma [Died] & Others ***...Defendants***

NOTICE

9) Sole Lakshmi, Wife of Srinu, Lingapalem, Lingapalem Mandal, CJCJ. WGDT. AP.

Whereas the plaintiff filed suit for partition of the plaint schedule property against the defendants The Honourable court order notice in the above 9th defendant.

Whereas as the notice addressed to the 9th defendant in the above suit could not be served as last known address and the notice could not be served;

Whereas the Honorable court ordered notice to the 9th defendant by substituted service by way of publication;

You, are hereby called upon to appear in person before this Honourable court Eluru on **09-10-2023 at 10:30 A.M.** and state your objections if any. Lest the suit will be decided exparte.

(As per court orders)
DEVULAPALLI KRISHNA SASTRY
Eluru, Advocate,
29-9-23. Eluru